ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (కేశవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 3-12-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అంతటా వ్యాపించి ఉన్న సద్వస్తువు మన హృదయంలో నిజమైన ఆత్మగా ఉంది. దాని గురించి మనం శ్రద్ధగా శ్రవణం చేయాలి. విన్న విషయమును అర్థంచేసుకోవటానికి ప్రయత్నించాలి. మీకు అర్థమైన విషయమును ప్రాక్టీస్ చేస్తే అది మీకు అనుభవంలోనికి వస్తుంది. ఊహాగానములతో పనిలేదు. ఇది ప్రత్యక్షముగా అనుభవంలోనికి వచ్చే విషయమే అని కృష్ణుడు గీతలో చెప్పాడు.

భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఎక్కడో ఉన్నాడు అనుకొన్న సర్వేశ్వరుడు ఇక్కడే ఉన్నాడు. మన ఇంద్రియాలకంటే, మనస్సుకంటే, బుద్ధికంటే అత్యంత సమీపముగ మనహృదయంలోనే ఉన్నాడు. అయితే మనకు లోపలకు చూసే అలవాటు తక్కువ. స్మశానమునకు వెళ్లేవరకు చర్మదృష్టిని విడిచిపెట్టలేకపోతున్నాము. కులంతో ఎవడూ చండాలుడు కాదు చర్మదృష్టి ఉన్నవాడు ఎవడైనా చండాలుడు అని ఒక మహాత్ముడు చెప్పాడు.

మానవుడిని నామము, రూపము ఆకర్షిస్తుంది. నామమునకు, రూపమునకు వాడిదృష్టి బంధించబడి ఉంటుంది. రూపము, నామము మనలను అకర్షిస్తున్నంతకాలము, ప్రకృతి మనలను ఆకర్షిస్తున్నంత కాలము మన మనస్సు బాహ్యముఖానికి విజృంభిస్తూ ఉంటుంది. మన మనస్సు బాహ్యముఖానికి విజృంభిస్తున్నంత కాలము మనకు వాసనా నాశనము కాదు. మీ మనస్సు బాహ్యముఖానికి విజృంభిస్తున్నంతకాలము మనకు వాసనా నాశనము కాదు కాబట్టి ఆ మనస్సును లోపలకు దింపవలసి ఉంది. బాహ్యముగా విజృంభిస్తున్న మనస్సును లోపలకు త్రిప్పగలిగితే అంటే మనస్సును నీ హృదయంలోనికి అంతర్ముఖం చేయగలిగితే వాసనాక్షయం అవ్వటం ప్రారంభమవుతుంది. ఇది ఒకేరోజులో అయ్యే పనికాదు. నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే వాసనలు ఆ రోజుకారోజు బలహీనపడుతూ ఉంటాయి.

స్థితప్రజ్ఞుడి లక్షణములలో భగవంతుడు రెండు పద్ధతులు చెప్పాడు. (1) విధ్వంసక పద్ధతి (2) నిర్మాణాత్మకపద్ధతి. నీ మనస్సులో అనేక పెంటగొడవలు ఉంటాయి. వాటిని బయటకు తోసివెయ్యి. చేనులో కలుపు మొక్కలు ఉంటే తీసి బయటపారవేస్తాము అలాగే నీ మనస్సులోని గొడవలను తీసి బయట పారవెయ్యి. ఇది విధ్వంసక పద్ధతి. ఆత్మకాని విషయములమీద నీ మనస్సు వాలకుండా చూసుకోవాలి. అది వైరాగ్యము. అప్పుడు ఆత్మను పట్టుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి. ఇది అభ్యాసము. ఇవి రెండూ Simultaneous గా చేసుకొని వెళ్ళాలి. ఇది నిర్మాణాత్మక పద్ధతి.

మేము పూజలు చేస్తున్నాము. మేము భక్తిమార్గములో ఉన్నాము అని చెపుతారు. అది సాధనలోనికి వస్తుంది మంచిదే. ఎవరో ఇతరులకు భక్తి లేకపోవచ్చును, సాధన లేకపోవచ్చును వారిని చూసి మీరు ఏమనుకొంటున్నారు అంటే వారికి సాధనలేదు, భక్తి లేదు మేము సాధన చేసేస్తున్నాము అనుకొంటారు. వెంటనే దాని వెనకాలే గర్వం ప్రారంభమవుతుంది. చేసేసాధన 10పైసలు అయితే వచ్చే గర్వం 20పైసలు. ఇతరులతో పోల్చుకోవటం

వలన వచ్చే ప్రమాదం ఇది. ఆధ్యాత్మిక సాధనలపేరు మీద గర్వం రాకుండా చూసుకోండి. అహంభావన రాకుండా చూసుకోండి. ఈ విషయంలో చాలా మెలకువగా ఉండాలి. చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ చైతన్యస్థాయిని పెంచుకొనే ప్రయత్నంలో సాధనల పేరుమీద మీ భౌతికమైన పనులను, విషయములను వేటిని నిర్లక్ష్యము చేయవలసిన పనిలేదు. పని మనలను విడిచి పెట్టాలి గాని మనం పనిని విడిచి పెట్టకూడదు అని రామకృష్ణుడు పదేపదే చెప్పేవాడు. దైనందిన జీవితములో మీరు చేసుకొనే పనిని ఈ భక్తి పేరు మీద గనుక విడిచిపెడితే రాబోయే జన్మలో మీరు ఏ పనిని విడిచి పెట్టారో ఆ పనే ఎదురవుతుంది. మీరు ఇష్టంతో ఆ పనిని చేయలేకపోతే ప్రకృతి బలవంతముగా మీచేత ఆ పనిని చేయిస్తుంది. చేసే పని ఎలాగూ తప్పదు. ఆ పనిని ఇష్టంతో చేస్తే ఆపని నెమ్మదిగా మనలను విడిచిపెట్టి వెళ్లిపోతుంది.

నీ హృదయంలో సత్యవస్తువు ఉంది. నీవు ఆలోతులకు దిగాలి. నీవు అందులోనికి దిగలేకపోతున్నావు. నీవు అందులోనికి దిగలేక వస్తువే లేదు అనుకొంటున్నావు. నాకు దిగే శక్తి లేదు అని నీవు అనుకోవటం లేదు. ఆలోతులకు వెళ్ళలేక వస్తువే లేదు అంటున్నావు. నీకు బరువు సరిపోవటంలేదు. వైరాగ్యంవలన నీకు బరువు వస్తుంది. అప్పుడు నీవు హృదయంలోనికి మునగగలవు.

నేను పనిచేసి పొందవలసింది ఈ లోకంలో ఏదీ లేదు. అయినా పని చేస్తున్నాను అని కృష్ణుడు చెప్పాడు. కృష్ణుడే పనిమానివేసాడు మేము ఎందుకు చేయాలి అని అనుకొని చైతన్యం అనుభవంలో లేనివారు కూడా పనిమానివేస్తారు. అందువలన నేను పని చేస్తున్నాను. పని చేసి సంపాదించవలసినది ఏమీనాకు లేదు. ఇతరులకోసం పని చేస్తున్నాను. కర్మను విడిచిపెట్టడం కాదు. కర్మఫలమును విడిచిపెట్టటం మంచిది అని గీత పొడుగునా వాసుదేవస్వామి చెపుతూవచ్చారు.

అప్పుడప్పుడు భగవద్గీత చదువుతాను అని ఒకరు భగవాన్‌తో అంటే ఎప్పుడూ చదువు అని భగవాన్ అన్నారు. ఎప్పుడూ చదువుతూ ఉంటే ఎప్పుడో ఒకప్పుడు దానిలోని లోతులు మనకు తెలుస్తాయి. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని మాటయొక్క అర్థం మనకు తెలియదు. భగవద్గీతలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం అంటూ ఏదీ లేదు. గీతను చదివేకొలది ఒకోసారి ఒకో అర్థం స్ఫురిస్తుంది. ఏ జ్ఞాని చెప్పినా, ఏ మహాత్ముడు చెప్పినా ఆ విషయములు గీతలోని 700శ్లోకాలలో ఏదో ఒకదానిని అతుక్కొని ఉంటుంది. భగవద్గీతలో సమస్త విషయములను చెప్పాడు. ఒక్కొక్కరి మానసిక ప్రవృత్తి ఒక్కొక్కలాగ ఉంటుంది. మీ మానసిక ప్రవృత్తికి గీతలో ఏదో ఒక్కశ్లోకం అయినా నచ్చుతుంది. భగవద్గీతలో ఉన్న 700శ్లోకాలలో 42శ్లోకాలను తీసి సుబ్బరామయ్యగార్కి భగవాన్ చెప్పారు. ఇది భగవద్గీతాసారము అనే పుస్తకం ~~తరువాత~~ క్రింద ప్రింటు చేసారు. ఈ 42శ్లోకాలు చదివితే 700శ్లోకాలసారము వచ్చేస్తుంది.

జ్ఞానియొక్క ప్రభావము భక్తుని హృదయంలోనికి నిశ్శబ్దంగా రహస్యంగా చొరబడుతుంది. జ్ఞానిచేసేపని ఆడంబరముగా చేయడు, నిశ్శబ్దంగా చేస్తాడు. వాడిని ప్యూరిఫై చేస్తున్నట్లు వాడికే తెలియదు. ప్యూరిఫికేషన్ అనేది అంతరాలలో నుండి వస్తుంది. జ్ఞానం అనేది పైనుండి పోసేది కాదు, లోపలనుండి ఊరేది అని భగవాన్ అంటూ ఉండేవారు.

ఎంతసేపు వ్యక్తిత్వం, వ్యక్తిత్వం అంటారు. ప్రతీ మనిషి వాడి వ్యక్తిత్వంను పెంచుకోవటానికి పనిచేస్తాడు. Individual Iకి మేత దొరకాలి. దానికోసమే సమాజంలో తిరుగుతూ ఉంటాడు. Individual I కోసం జీవితం అంతా పాడుచేసుకొంటున్నావు. ఇలా ఎన్ని జీవితాలు పాడుచేసుకొంటావు. గాఢనిద్రలో నీ Individual I ఏమయింది అన్నారు భగవాన్. నీవు ఏ Individual Iకోసం బ్రతుకుతున్నావో అది నీ గాఢనిద్రలో ఎడ్రసు లేకుండా పోతోంది. అదే గనుక నిజం అయితే గాఢనిద్రలో కూడా అది బయటకుపోవటానికి వీలులేదు. నీవు

ఏదైతే కాదో వాటిలోనుండి గాఢనిద్రలో నీవు విడిపోతున్నావు. నీ బంధువులతోటి, స్నేహితులతోటి, దేహంతోటి, ప్రపంచంతోటి, దేవునితోటి విడిపోతున్నావు. వీటి అన్నింటిలోనుండి విడిపోయినపుడు కూడా నీవు అక్కడ ఉంటున్నావు. గాఢనిద్రలో నేను లేను అని ఎవడూ చెప్పడు. గాఢనిద్రలో ఎవడైతే ఉన్నాడో వాడు జాగ్రదావస్థలో కూడా ఉన్నాడు. వాడిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే జ్ఞానం. గాఢనిద్రలో నీకు తెలియకుండా నీ మనస్సు దాని పుట్టుస్థానమైన హృదయంలోనికి పోతోంది. జాగ్రదావస్థలో తెలివితో వివేకంతో, ఎరుకతో మనస్సును హృదయంలోనికి పంపాలి

చెడ్డవారితో స్నేహంకంటే మంచివారితో విరోధం మంచిది అని చెపుతూ ఉంటారు. మంచివాడితో విరోధం ఉంటే ఆ విరోధం వలన వాడు ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చినా మనం బాగుపడతాము. వాడు ఏరకంగా జ్ఞాపకం వచ్చినా మంచితనమే జ్ఞాపకం వస్తుంది. మంచి చేసినవాడికి దుర్గతి లేదు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. తగిన ఫలముతో వాడిని అనుగ్రహిస్తాడు. మీరు చేసిన మంచి మీరు మర్చిపోవచ్చును. ఆయన మర్చిపోడు. ఎప్పుడో ఒకప్పుడు ఆ ఫలితమును ఇచ్చితీరతాడు. దేవుడు అడిగినవాళ్ళకు అడిగినదే ఇస్తాడు, అడగని వాళ్ళకు అన్నీ ఇస్తాడు అని రమణమహర్షి చెపుతూ ఉండేవారు. ఏది ఎప్పుడు ఎక్కడ ఇవ్వాలో అది ఇస్తూ ఉంటాడు. ఒకోసారి నీ కోరికను నెరవేర్చడు. కోరికను నెరవేర్చితే దానివలన వచ్చే ఫలితమును ఇముడ్చుకొనే అర్హత నీకు లేనపుడు దానిని పెండింగ్‌లో ఉంచుతాడు. నీవు అర్హత, యోగ్యత సంపాదించిపుడు ఆ ఫలితముతో అనుగ్రహిస్తాడు. మీరు తొందరపడవద్దు. నెమ్మదిగా సాధన చెయ్యండి. జన్మాంతరములోనుండి వచ్చిన సంస్కారములు ఒక్కరోజులో పోవు. నెమ్మది నెమ్మదిగా తగ్గించుకొంటూ రావాలి. కంగారు పడితే మానసిక ఆరోగ్యము పాడవుతుంది.

జ్ఞానికి, జ్ఞానికి మధ్య బేధం చూడనక్కరలేదు. ప్రకృతిగుణాలు దాటిన తరువాత ఎవరైనా ఒకటే. జ్ఞానులతో, మహాత్ములతో సాంగత్యం మంచిదే. దాని వలన మీకు తెలియకుండానే సాధన జరిగిపోతూ ఉంటుంది. వారు నిశ్శబ్దంగా పనిచేస్తారు. మాటలతో పని లేకుండా, చూపుతో పనిలేకుండా, స్పర్శతో పనిలేకుండా కేవలము మౌనంతో వారు ఇవ్వవలసింది ఇచ్చేస్తారు. జ్ఞాని మౌనం ద్వారా బోధిస్తాడు. మౌనం నీకు అర్ధంకానపుడు మాటలు చెపుతాడు. జ్ఞానియొక్క మౌనం అనుగ్రహం. జ్ఞాని యొక్క మాట అనుగ్రహం. అది శబ్దం కాదు. అది మాట కాదు. కేవలము అనుగ్రహము. జ్ఞాని యొక్క మౌనం అత్యంత శక్తివంతమైనది. అక్కడ మనస్సు మూసుకొనిపోతుంది. ఎక్కడయితే మనస్సు వేరుతో సహా నాశనం అయిందో అక్కడనుండి మహాశక్తి ప్రవహిస్తుంది. ఆ ఉపాధి ద్వారా శక్తి తరంగాలు వచ్చి లోకాన్ని అంతా పవిత్రం చేస్తూ ఉంటాయి. ముందు నీవు జ్ఞానివి అవ్వటానికి ప్రయత్నం చెయ్యి అనేవారు భగవాన్. జ్ఞానికి బంధువుగా ఉండటంకాదు, జ్ఞానికి స్నేహితుడిగా ఉండటంకాదు, జ్ఞానం పొందటానికి ప్రయత్నం చెయ్యి. మానసిక సాంగత్యము అవసరము. రామకృష్ణుడు శరీరముగాని, రమణమహర్షి శరీరముగాని ఇక్కడ లేదు కదా అని అనుకోవటం కాదు. వారితో మానసిక అనుబంధము పెట్టుకోండి. నీ స్వరూప సాక్షాత్కారమునకు వారు సహాయపడతారు. నీ హృదయం యొక్క లోతులలోనికి నిన్ను మోసుకొనిపోతారు. సందేహం పెట్టుకోవద్దు. సందేహము పెట్టుకున్నవాడు నశిస్తాడు. భగవంతుని మీద సజీవమైన విశ్వాసం కలిగి ఉండాలి.

జ్ఞాని మాట్లాడుతూ ఉంటే జ్ఞాని సమక్షంలో ఉన్నవారు బాగుపడటమే కాదు, లోకం అంతా బాగుపడతారు. జ్ఞానియొక్క మాట ప్రపంచము అంతటా వ్యాపిస్తుంది. ఎంతకాలము సూర్యచంద్రులు ఉంటారో ఎంతకాలము నదులు ప్రవహిస్తూ ఉంటాయో అంతకాలము జ్ఞానియొక్క మాట సజీవముగా ఉంటుంది. జ్ఞానియొక్క నాలుక హృదయంలో ఉంటుంది. జ్ఞానియొక్క మాట హృదయ సారముగా ఉంటుంది. కొండమీద దీపం పెట్టి ఎవడికీ కనబడకూడదు అంటే ఎలాగ? అన్నాడు ఏసు. అలాగే జ్ఞాని మాట ఎవరికీ వినపడకూడదు అంటే ఎలా కుదురుతుంది. అది ప్రపంచము అంతా వ్యాపిస్తుంది.

మనకు అర్హత లేనపుడు, యోగ్యత లేనపుడు, సర్వేశ్వరుడు వచ్చి మన ప్రక్కన కూర్చున్నా మనం ఆయనను గుర్తించలేము. పరమేశ్వరుడు వచ్చి మన ప్రక్కన కూర్చున్నా మనకు అర్హత ఎంతవరకూ ఉందో అంతవరకే పొందగలము. అర్హతను మించి మనం ఏమీ పొందలేము.

కొంతమంది మనుషులు ఎలాగ ఉంటారు అంటే వారివలన మనకు ఉపకారం జరగకపోయినా మీ వలన ఉపకారం జరిగింది అని మనం అంటే నిజమే అంటారు. జ్ఞానిద్వారా మనకు సహాయం అందుతూ ఉంటుంది. ఆయనద్వారా సహాయం అందుతున్నట్లు మనకు కూడా తెలియనివ్వడు. ఆయన మన గుర్తింపును కోరడు ఎందుచేతనంటే జ్ఞానికి ఇతరులు లేరు. అహంకారి గుర్తింపును కోరుకుంటాడు. ఎందుచేతనంటే అహంకారికి ఇతరులు ఉన్నారు.

ఒక జ్ఞానిని పూజిస్తే అది ఈశ్వరునికే అందుతుంది. ఎందుచేతనంటే జ్ఞాని ఈశ్వరుని స్వరూపమై ఉన్నాడు. మహాత్ముల దర్శనం వలన ఎంతోకొంత ఉపకారం జరుగుతుంది. జ్ఞానిని దర్శించటంవలన మనం కూడా ఆస్థాయికి ఎదగాలి అనే సంకల్పము మనకు కలుగుతుంది. నీలో ఏమైనా దోషములు ఉన్నా జ్ఞాని దర్శనంవలన ఒక్కొక్కటి బలహీనపడి రాలిపోతాయి. ఒకసారి భగవాన్ భిక్షకు వెళ్ళినపుడు ఒక ఇంటి దగ్గర కొందరు పేకాట ఆడుకొంటున్నారట. పేకాట ఆడేవారు భగవాన్‌ను వెళ్ళిపొమ్మని అంటున్నారట. కాని ఆ ఇంటిలోని అమ్మగారు ఉండమని చెప్పిందట. ఆవిడ అన్నం పెట్టేలోపు భగవాన్ పేకాట ఆడేవారివంక చూస్తూ ఉన్నారట. వారిని ఆడవద్దని అయన చెప్పలేదు. ఒక నెలరోజులకు వారికి పేకాట ఆడాలనే బుద్ధిపోయిందట. జ్ఞానియొక్క ప్రభావము అటువంటిది.

నేను ఎవడను అను పుస్తకం వ్రాసిన శివప్రకాశం పిళ్లె ఆయన భార్య చనిపోయిన నాలుగు సంవత్సరాలకు భగవాన్ దగ్గరకు వెళ్ళి స్వామి నన్ను మళ్ళీ పెళ్లి చేసుకోమంటారా? వద్దా? అని అడిగారు. నాలుగు రోజులు అక్కడే ఉన్నా భగవాన్ దానికి ఏమీ సమాధానం చెప్పలేదట. చేసుకోమని చెప్పలేదు. చేసుకోవద్దు అని చెప్పలేదు. అక్కడ మాట చెప్పటం కాదు ఆయనలో మారుమనస్సు తీసుకొనిరావటం ముఖ్యం అని భగవాన్ ఉద్దేశ్యం. లోపల మారుమనస్సు తీసుకొని రావాలిగాని పైకి మాటలు చెప్పటం వలన ప్రయోజనం ఏముంది.

నీలో ఏదైనా దోషము ఉంటే, ఏదైనా పాపము ఉంటే గురువు దర్శనం వలన అవి క్రమేణా తగ్గిపోతాయి. నీవు కంగారుపడవద్దు. అది గురువు చూసుకొంటాడు. ఎంత బరువైన రాళ్ళు నీ హృదయంలో ఉన్నా వాటిని తీసి మంటపెడతాడు. ఏ బలహీనతలు నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో వాటిని బయటకు లాగి మంట పెడతాడు.

ఎదుటివారు ఎవరైనా బాగుపడుతూ ఉంటే మనకు వెంటనే సంతోషం రావాలి. వెంటనే సంతోషం రాకపోతే మన లోపల దోషము ఉన్నట్లు గుర్తు.

మనతో తర్కించటానికి గాని, వాదించటానికి గాని రమణమహర్షి ఈ భూమి మీదకు రాలేదు. జ్ఞానం పంచి పెట్టటానికి ఈ భూమిమీదకు వచ్చారు. భగవాన్ ఏమి చెప్పినా జ్ఞానమే ప్రధానముగా చెప్పేవారు. మహిమలు గురించి కూడా మాట్లాడరు. జ్ఞానం యొక్క వైభవానికి భంగంఅని ఆయన మహిమల గురించి మాట్లాడేవారు కాదు. మీ వలన ఈ ఉపకారము జరిగింది అంటే నిజమే అని చెప్పే దేవుడుకాదు ఆయన. అలా చెపితే జ్ఞానంయొక్క వైభవానికి భంగం. ఆయన వలన ఏదైనా జరిగితే జరుగవచ్చు. అవి అన్నీ రెండవ పక్షము. ఆ గొడవలోనికి మీ మనస్సును రానిచ్చేవారు కాదు. వస్తే అసలు లక్ష్యాన్ని మర్చిపోతారు. మీ లక్ష్యాన్ని మర్చిపోకూడదు.

జీవితానికి ఒక గమ్యం పెట్టుకోవాలి. జీవితానికి గమ్యం పెట్టుకొన్నవాడు కూడా తప్పులు చేయవచ్చును. ఒక జీవితానికి ఒక గమ్యం పెట్టుకొన్నవాడు 10 తప్పులు చేస్తే గమ్యం లేనివాడు 100 తప్పులు చేస్తాడు. ఒక గమ్యం పెట్టుకుంటే మనం చేసే తప్పులు తగ్గుతాయి. మనలోని బలహీనతలు కూడా తగ్గుతాయి. ఎందుచేతనంటే

గమ్యం సాధించటంకోసం బలహీనతలు తగ్గించుకొంటాము. అందుచేత గమ్యం ఉండాలి. బాగా ఆలోచించుకో. సమగ్రంగా ఆలోచించుకో. ఇది సాధించాలి అని అనుకో. గమ్యమును దృష్టిలో పెట్టుకొని ప్రయాణం చెయ్యి. ప్రతీ చిన్న విషయానికి అనుమానం వద్దు. నీవు అనుమానిస్తూ ఉంటే నీ ప్రయాణం సాగదు.

ఆత్మను తెలుసుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి. నీ హృదయంలో ఉన్న ఆత్మ నీ సాధనను చూస్తూ ఉంటుంది. నీ సాధన నిజమయినపుడు నిన్ను అనుగ్రహించటంకోసం ఆత్మే రూపము ధరించి వస్తుంది. వాడే గురువు. ఆత్మ వేరు, గురువు వేరు, దేవుడు వేరు కాదు. ఆత్మ, గురువు, దేవుడు ఒక్కటే. భక్తి అనేది గొప్పలకోసం కాదు. నీ మనస్సు పవిత్రం అవ్వటానికే భక్తి. భక్తిభావనవలన నీవు పవిత్రుడవు అవ్వాలి. మనలను మనం పవిత్రం చేసుకోవటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో నీవు పవిత్రుడవయితే జ్ఞానం రావటం కూడా అంతే తేలిక.

ఈశ్వరుడిపట్ల నీకు భక్తి ఉంటే నీవు పక్వానికి వస్తావు. శరీరానికి 70సంవత్సరాలు వచ్చేస్తాయి, లోపల ఆలోచన చూస్తే చిన్నపిల్లల ఆలోచనలా ఉంటుంది. చేష్టలు తింగర తింగరగా ఉంటాయి. అలాకాదు. ఈ భక్తి వలన నీ మనస్సు పక్వానికి రావాలి. నీవు బాగా ముగ్గాలి. నీవు ఎన్ని సంవత్సరాలు అయినా పచ్చి పచ్చిగా ఉండకూడదు. పక్వానికి రావాలి. తల్లి కడుపులోనుండి బయటకు వచ్చినది మొదలు శారీరకంగా ఎలా ఎదిగామో మానసికంగా కూడా అలా ఎదగటానికి ప్రయత్నం చేయాలి. చైతన్యస్థాయిని పెంచుకోవాలి. వివేకం పెంచుకోవాలి. గ్రహించే శక్తి పెరగాలి. భక్తివలన నీవు మొద్దబ్బాయి అవ్వకూడదు. భక్తివలన నీవు పరిపక్వానికి రావాలి.

భగవంతుడు గురు రూపములో వచ్చి ఒకమాట చెపితే దానిని అర్థంచేసుకొనే శక్తి ఎప్పుడైతే నీకు వచ్చిందో అప్పుడు నీ హృదయంలో ఉన్న ఆత్మే గురురూపంలో వస్తుంది. గురురూపంలో రావటమేకాదు నీవు పక్వానికి వచ్చావు కాబట్టి నీవు ఏ దేశంలో ఉన్నా, ఏకాలంలో ఉన్నా ఎక్కడ ఉన్నా నిన్ను ఆకర్షించుకుంటాడు. వాడే గురువు. బాహ్య గురువు బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును లోపలకు నెట్టుతాడు. వాడే నిన్ను ఆకర్షించుకుంటాడు. వాడి మాటలు నీకు అర్థమయ్యేలా వాడే చేస్తాడు. నీ పాడుబుద్ధికి వాడి మాటలు తెలియవు. నీపాడుబుద్ధిని సంస్కరించి వాడి మాటలయొక్క విలువ నీ బుద్ధికి పట్టేలా వాడే నిన్ను అనుగ్రహిస్తాడు. వాడిమీద ప్రేమ కలిగేలా వాడే చేసుకుంటాడు. బాహ్యగురువు నిన్ను లోపలకు గెంటి వాడు బయటకు పోతాడు. లోపల ఆత్మ రెడీగా ఉంది. లోపల ఉన్న ఆత్మ నిన్ను తనలోనికి గుంజేసుకొని తన స్వరూపమును ఇస్తుంది.

రమణమహర్షికి గురువులేడు. అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువుగా వ్యవహరించాడు. గురురూపములో ఆయనను ఆకర్షించాడు. ఒక మహాప్రవాహములో గడ్డిపరక ఎంత వేగముగా కొట్టుకొని వస్తుందో అంతవేగముగా మధురనుండి అరుణాచలం కొట్టుకొని వచ్చాను అని ఆయన చెప్పాడు. కొంతమంది పుట్టుకతోనే మహాత్ములు ఉంటారు. వారికి తప్ప మిగిలినవారికి సాధారణంగా గురువు అవసరమే. మనకు గురువు దొరికినపుడు గురువును విడిచిపెట్టకూడదు. మనకు ఎక్కువ శ్రమలేకుండా గురువు చెప్పటంవలన మనం విషయమును అర్థం చేసుకోవచ్చును. అందువలన గురువును ఉపయోగించుకోవాలి. అవకాశమును విడిచిపెట్టవద్దు. Subject నేర్చుకొనేటప్పుడు చెప్పే గురువు శరీరం పడిపోయింది అనుకో Subject శ్రవణం చేయటానికి ఇంకో గురువు దగ్గరకు వెళ్ళవచ్చు. ఇంకో గురువు దగ్గరకు వెళ్లి నేర్చుకోవటంలో ఆక్షేపణ ఏమీ లేదు. ఇందులో ఏ గురువూకూడా రూపంకాదు. అది గ్రహించాలి.

అంతా వాసుదేవస్వరూపమే అంటూ ఉంటారు. అంతా వాసుదేవస్వరూపమే అన్నప్పుడు వాడు కూడా వాసుదేవ స్వరూపము అన్న సంగతి మర్చిపోతున్నాడు. నేను వేరు, వాసుదేవస్వరూపము వేరు అనుకొంటూ ఉంటాడు. ఆ చెప్పేవాడు కూడా వాసుదేవుడే. తనను మినహాయించుకోకూడదు. అది గ్రహించాలి.

భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ హృదయంలో ప్రేమ, ఆప్యాయత ఉన్నప్పుడు మనం దగ్గరగా ఉన్నవారితో సమానమే. నీ పొరుగువాడు ఎవడు? అన్నాడు ఏసు, నీ క్షేమం ఎవడైతే కోరుతున్నాడో, నీ ఉజ్వలభవిష్యత్ ఎవడైతే కోరుతున్నాడో వాడు నీకు శారీరకంగా దూరంగా ఉన్నప్పటికీ వాడు నీ పొరుగువాడు అన్నాడు ఏసు. కొంతమంది మనకు దగ్గరగా ఉంటారు మనం ఎప్పుడు పోతామాఅని చూస్తూ ఉంటారు. వారు పొరుగువారు కాదు. నీ భవిష్యత్ కోరేవారు ఎక్కడ ఉన్నా నీ పొరుగువారితో సమానము. నీ పాడుకోరేవాడు భౌతికంగా నీ ప్రక్కన ఉన్నా వాడు నీకు పొరుగువాడు కాదు. నీ క్షేమం కోరేవాడు ఈ భూమిమీద ఎక్కడ ఉన్నా వాడు నీ పొరుగువాడే. నీ దేహం ఎక్కడయినా ఉండవచ్చు. నాదేహం ఎక్కడయినా ఉండవచ్చు. హృదయంలో ప్రేమ, అనురాగం ముఖ్యము. మానసిక సాంగత్యము ముఖ్యము. భౌతికంగా దగ్గరగా ఉండటం అనేది రెండవ పక్షం. శరీరములు ఎక్కడ ఉన్నా మానసికంగా దగ్గరగా ఉండాలి. హృదయములు సమీపంలో ఉండాలి. భౌతికంగా దగ్గరగా ఉండటంకంటే మానసికంగా దగ్గరగా ఉండడం అంటే మానసిక అనుబంధము కలిగి ఉండడం ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదకారి అని భగవాన్ చెపుతున్నారు.

పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఉండాలి. అలాగే నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి (1)పవిత్రత (2)ఏకాగ్రత అవసరము. పక్షి రెండు రెక్కల సహాయంతో ఎలా ఎగురుతుందో అలాగ నీవు హృదయం యొక్కలోతులలోనికి చొచ్చుకొనిపోవటానికి నీకు పవిత్రత, ఏకాగ్రత అనే రెండు రెక్కలు అవసరము అని స్వామిశివానంద్ అంటూ ఉండేవారు.

దేవుడు ఏమి చేసాడు అంటే జ్ఞానం అనే పెట్టెను మన హృదయంలో పెట్టాడు. తాళం చెవి వాడిచేతిలో పెట్టుకొన్నాడు. వాడు సంతోషించేలా మనం బ్రతికితే మన తాళంచెవిని మనకు పారవేస్తాడు. అప్పుడు పెట్టెను తెరుచుకుంటే మనం జ్ఞానులమవుతాము.

రమణమహర్షిగారు చాలా impersonal. చరిత్రలో ఇటువంటి వ్యక్తి దొరకటం కష్టం. ఈ అరుణాచలంతో మాకు సంబంధము ఏమిటి, మీరు ఉన్నారు అని మేము వచ్చాము అని ఒక భక్తుడు భగవాన్‌తో చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే నేను ఎవడిని బట్టి వచ్చాను. నన్ను ఏ దేవుడు అయితే ఇక్కడకు తీసుకొని వచ్చాడో వాడే మిమ్ములను కూడా తీసుకు వచ్చాడు. నన్ను ఏదేవుడు అయితే అనుగ్రహించాడో వాడే మిమ్ములను కూడా అనుగ్రహిస్తాడు అన్నారు భగవాన్. అదీ impersonal గా మాట్లాడటం అంటే. ఏదీ ఆయన మీద పెట్టుకోరు.

మేము జపం చేసుకొంటున్నాము అంటే చేసుకోండి అనేవారు. మేము ధ్యానం చేసుకొంటున్నాము అంటే చేసుకోండి అనేవారు. భగవాన్ పద్ధతి అదికాదు. కాని మీరు ఏ మార్గములో ప్రయాణం చేస్తున్నారో అందులో encouragement ఇచ్చేవారు. ఎందుచేతనంటే మిమ్ములను disturb చేయకూడదు. ఎవరు ఏమార్గములో పొందినా జ్ఞానం ఒకటే. సృష్టిలో ఇప్పటివరకూ ఏ ఇద్దరూ ఒకేమార్గములో జ్ఞానమును పొందలేదు. అనుకరణవలన జ్ఞానం రాదు. మనకు నచ్చిన మార్గములో , ప్రీతి అయిన మార్గములో ప్రయాణం చేయటమే. అనుకరణ వద్దు. దేహం ఎక్కడ ఉందో మీ మనస్సు కూడా అక్కడే ఉండాలి. మీకు నచ్చిన మార్గములో ప్రయాణం చేయగా, చేయగా ఆత్మానుభవం పొందటానికి ఏవైతే ఆటంకములుగా ఉన్నాయో అవి పోయి ఉన్నది మిగులుతుంది. మీరు ఎవరిగా ఉన్నారో ఆ స్వరూపము మిగులుతుంది. జ్ఞానంమీకు మిగులుతుంది. ఉన్నదేదో మిగులుతుంది. లేనిదంతా పోతుంది. లేనిదేదో పోయిన తరువాత ఉన్నదేదో మనకు తెలుస్తుంది.

❖ ❖ ❖